గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఉపాధి కూలీ శుక్రవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. తోటి కూలీలు తెలిపిన వివరాల ఇవి.. తాండవపల్లి గ్రామం మన్నానగర్ కాలనీకి చెందిన కందికట్ల పల్లంరాజు ఉపాధి పనికి వెళ్లి పని పూర్తి చేసుకొన్న తరువాత పని ప్రదేశంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఫిల్డ్ అసిస్టెంట్ పరమట దివాకర్, గ్రామ సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు, అధికారులు సమాచారం ఆందజేశారు. మృతి చెందిన పల్లంరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరావు, పలువురు డిమాండ్ చేశారు.



పల్లంరాజు మృతదేహం వద్ద సర్పంచ్ ఏసుబాబు తదితరులు

ఎన్నికల్లో సిబ్బంది పనితీరు భేష్

కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

నూతనంగా ఏర్పడిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మౌలిక వసతులు తక్కువగా ఉండి సిబ్బం ది కూడా కొరత ఉన్నప్పటికీ వాటన్నింటినీ అధిగమించి సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో సాధారణ ఎన్నికల కు నిర్వహణకు సంబంధించి రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది సక్సెస్ మీట్ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు-2024 ప్రశాంత వాతావ రణంలో స్వేచ్ఛా యుతంగా నిర్వహించడంలో సజావుగా నిర్వహించేందుకై సహకరించిన అధికార సిబ్బంది ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్, రిటర్నింగ్ అధికారులు, జిల్లా అధికారుల ఎన్నికల ప్రక్రియ నిర్వహణ అనుభవాలు, సవాళ్ళు వాటిని అధిరోహించడానికి చేపట్టిన చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ ఎన్నికల్లో తొలిసారి పాల్గొన్న అధికారులు మంచి అనుభవాన్ని గడించి భవిష్యత్తులో ఎన్నికల ప్రక్రియను ఎంతో సజావుగా నిర్వహించుకునేందుకు అవకాశాలు మెరుగుపడతాయన్నారు గత ఏడాదిన్నరగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి బిఎల్వోలు సహకారంతో ఎన్నికల నిర్వహణకు పునాది అయినటు వంటి కచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పన దగ్గర నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన తరువాత ఎంపిడిఒలు ప్రవర్తన నియమాలు అమల్లో ఎంతో జాగరుకతతో వ్యవహరించి ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చేపట్టిన చర్యలు అమోఘమన్నారు. అదే విధంగా రిటర్నింగ్ అధికారులు ఒకపక్క రాజకీయ పార్టీల ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ మరొకపక్క పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు శిక్షణలు, పోలింగ్ ప్రక్రియ నిర్వహణ సన్నద్ధత చర్యలు కౌంటింగ్ నిర్వహణ చర్యలు శిక్షణ కార్యక్రమాలపై ఎంతో దష్టి సారించి అన్ని విధాల సాధారణ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలు విజయవంతం కావడం అభినందనీయమన్నారు. బందస్ఫూర్తితో అనుభవాన్ని జోడించి అధికారుల మరియు రాజకీయ నాయకుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం జిల్లాకు గర్వకారణమన్నారు. రేయింబవళ్లు ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయ డంలో అధికారులు సఫలీ కతం అయ్యారని తెలిపారు ఎక్కడ ప్రతికూల వార్తలు ప్రచురితం కాకుండా చర్యలను పటిష్టంగా వించడం అభినందనీయమన్నారు. విఆర్ఓ దగ్గర్నుంచి ఆర్ఓ వరకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవతో వ్యవహరించి పారదర్శకంగా విధులు చేపట్టడం మూలంగా విజయ అవకాశాలు లభించాయ న్నారు. మున్సిపల్ కమిషనర్లు ఎంతో చొరవ తీసుకుని ఎన్నికల క్రతువులో భాగస్వామ్యం వహించారని ఆయన తెలిపారు ఎన్నికల నిర్వహణ సంబంధించి శిక్షణ కార్యక్రమాలు ప్రాక్టికల్ గా ఒకటి రెండు సార్లు నిర్వహించడం వల్ల ప్రక్రియ నిర్వహణపై పూర్తి అవగాహన సిబ్బందిలో పెంపొం దించడం ద్వారా ప్రక్రియ సులవ తరంగా పూర్తయిందన్నారు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతి అంశానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని వాటిని పక్కాగా ఆచరించడం వల్లే సత్ఫలితాలు పొందగలిగామన్నారు. ఇవిఎంల కమిషనింగు విషయంలో సెక్టోరి యల్ అధికారులు చాకచక్యంగా వ్యవహరించడంతో ఎక్కడ ఇబ్బందులు తలెత్తలేదని స్పష్టం చేశారు. సిబ్బందిని ఎ టువంటి ఇబ్బందులకు గురి చేయరాదని సంకల్పంతో ఫ్రీ హ్యాండ్ ఇచ్చి స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహించే విధంగా ఒత్తిడి లేకుండా జిల్లా యంత్రాంగం పని చేయించుకోవడం వల్ల ఈ సత్ఫలితాలు వచ్చాయన్నారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా సిబ్బందిలో నమ్మకాన్ని పెంపొందించడంతో పాటుగా మంచి గైడెన్స్ ను ఇవ్వడం ద్వారా సిబ్బంది విధి నిర్వహణలో సఫలీకతమ య్యారన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో సిబ్బంది తక్కు వగా ఉన్నప్పటికీ అన్ని విధాలుగా సిబ్బందిని సమీకరించుకుని విధులు సమర్ధవంతంగా చేపట్టడంలో జిల్లా యంత్రాంగం సఫలీకతమైంద న్నారు ఎన్నికల నిర్వహణలో టీచర్లు కూడా సమర్ధవంతంగా విధులు నిర్వహించి పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేశారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శుక్లా, ఎస్పి ఎస్. శ్రీధర్



పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నతాధికారులు

అధికారులకు సత్కారం

జిల్లా ఎస్పి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లాలో 1644 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఆమేరకు పోలీస్ సిబ్బంది జిల్లాలో లేరని వివిధ కంపెనీల నుండి సిబ్బందిని రప్పించుకుని విధులు నిర్వహిం చామన్నారు. ప్రతి ఒక్కరు నాణ్యమైన సేవలను సమూలంగా అందించి సహకరించారని వారంద రికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో విశిష్ట ప్రతిభను కనబరిచిన అధికారులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెసి ఎస్. నుపూర్ అజయ్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిఆర్డిఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ ఎస్. మధుసూదన్, పంచాయ తీరాజ్ ఎస్‌సి కె.చంటిబాబు, రిట ర్నింగ్ అధికారు లు, జిల్లా వ్యా ప్తంగా ఉన్న తహశీల్దార్లు, డిటీలు తదితరులు పాల్గొ న్నారు.

ఎంఎల్ఎల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అమలాపురం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థులు ఎంఎల్ఎలుగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరిచేత ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణం స్వీకారం చేయించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న రామచంద్రపురం ఎంఎల్ఎ సుభాష్



అమలాపురం ఎంఎల్ఎ ఆనందరావు



ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు



ప్రమాణస్వీకారం చేస్తున్న మండపేటఎంఎల్ఎ జోగేశ్వరరావు



ప్రమాణస్వీకారం చేస్తున్న రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

తాగునీటి పరిరక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రజలకు సరఫరా చేసే తాగునీటి పరిరక్షణకు అత్యదిక ప్రాధాన్యతనివ్వాలని అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జి రాజు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలు నందు శుక్రవారం మండల పరిషత్ అభివద్ధి అధికారి కెవి.నరసింహ రావు అధ్యక్షతన శానిటేషన్‌పై ప్రత్యేక అవగాహనా సదస్సును నిర్వహించారు.ఈ సదస్సుకు బొజ్జిరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాగునీటిని సరఫరా చేసే మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను విధిగా ప్రతి 15 రోజులకు క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయించాలన్నారు. సూపర్ క్లోరినేషన్ చేయడం ద్వారా నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను అరికట్టవచ్చునన్నారు. రాబోవు వర్షా కాలాన్ని దష్టిలో ఉంచుకుని పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వీటి నిర్వహణలో అనుబంధ శాఖలైన రక్షిత మంచినీటి సరఫరా, విద్యుత్ శాఖలు సమన్వయంతో పని చేసి ప్రజారోగ్య పరిరక్షణకు కషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి ఎఎన్.శ్రీనివాస్, విస్తరణ అధికారిని శ్రీ లక్ష్మీ కళ్యాణి, విద్యుత్ శాఖ ఎఇ శివాజీ, రక్షిత మంచినీటి సరఫరా ఎఇ నానాజీరావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి

ఎంపిడిఒ కొండలరావుకు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల ఎంపిడిఒగా పనిచేస్తున్న ఎవివిఎస్ఆర్. కొండలరావు శుక్రవారం ప్రతిభా పురస్కారం అందుకున్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఉత్తమ సేవకు గుర్తింపుగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఎంపిడిఒ కొండలరావును పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది, అభినందనలు తెలిపారు.



కలెక్టర్ శుక్లా చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎంపిడిఒ

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఆలమూరు

స్థానిక కోర్ట్ ఆవరణములో ఈ నెల 29న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షి దారులు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులకు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోనేటట్లు చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయశాఖ కృషి చేస్తున్నదన్నారు.

వ్యాధుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-అమలాపురం

డయేరియా, తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్, మున్సిపల్, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ ల అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సౌరబ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి.కష్ణబాబు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ,మున్సిపల్ పరిపాలన విభాగం అధికారులు అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ తాగునీటి వనరులను మరియు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్దేశిత సమయంలో క్లోరినేషన్‌తో పరిశుభ్రం చేస్తూ సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. డయేరియా వ్యాధుల నియంత్రణ చర్యలపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూాగునీటి వనరు లను మరియు ఓవర్ హెడ్‌ట్యాంకులను నిర్దేశిత సమయంలో క్లోరినేషన్‌తో పరిశుభ్రం చేస్తూ సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. తాగునీటి వనరులు నూటికి నూరు శాతం సురక్షితంగా ఉన్న నీటిని మాత్రమే సరఫరా చేయాలని ఆయన స్పష్టం చేశారు. రుతుపవనాలు ఆగమనం లో కురిసే వర్షాలు మూలంగానూ పైపులైన్లు, డ్రెయినేజీల్లో క్రాసింగ్ సందర్భాల్లోనూ తాగునీరు కలుషితం అయ్యేందుకు అవకాశాలు నిండుగా ఉన్నాయని వాటిపై నిఘా ఉంచుతూ నీటి సరఫరా వ్యవస్థలో లోటుపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దాలని ఆయన స్పష్టం చేశారు. రెగ్యులర్గా క్లోరినేషన్, రెగ్యులర్గా నీటిని నమూనాలు సేకరిస్తూ నాణ్యత పై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ అధికారులు మున్సిపల్ స్థాయిలో మున్సిపల్ అధికారులు సురక్షిత త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నీటి సరఫరా లో సురక్షిత తాగినీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పైప్‌లైన్ లను తనిఖీ చేయాలని ఆదేశిం చారు. కేంద్ర ప్రభుత్వం డయేరియా క్యాంపెయిన్ జూలై 1 నుంచి రెండు నెలలపాటు నిర్వహించనున్నదని స్పష్టం చేశారు. కీటక జనత మరియు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురికి కుంటలలో క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తూ వ్యాధులు నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. జిరో నుంచి అయిదు సంవత్సరాల వయసు గల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒఆర్ఎస్ జింక్ ద్రావణాన్ని చిన్నారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ సురేష్ బాబు, పంచాయతీరాజ్ ఎస్ఇ కె.చంటిబాబు, మున్సిపల్ అధికారులు అమలాపురం ఎస్‌మనోహర్ మండపేట బి.రాము రామచంద్రపురం బి.శ్రీనివాస్, ముమ్మిడివరం వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గ్రామాల్లో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని ఇఒపిఆర్‌డి కెఎస్.గౌరీ కుమారి ఆయా గ్రామ సర్పంచ్ లకు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం పలు గ్రామాల్లో ఇ ఒ పి ఆర్ డి గౌరీ కుమారి పర్యటించి పరిశుభ్రతపై పలు సూచనలు ఇచ్చారు.వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకు పోకుండా చూడాలన్నారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.భీమనపల్లిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్ ను గౌరీ కుమారి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు లతో కలిసి గౌరీ కుమారి సందర్శించి వర్మీ కంపోస్ట్ తయారీ పనితీరును పరిశీలించి సూచనలు ఇచ్చారు.



భీమనపల్లిలో వర్మీ కంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్, ఇఒపిఆర్‌డి

గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ వైద్యశిబిరం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం వన్నె చింతలపూడి గ్రామాన్ని గ్లోబల్ ఫౌండేషన్ దత్తత తీసుకోవడంతో ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించాలని ఎడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా వారి ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం రూరల్ వన్నె చింతలపూడి గ్రామంలో క్షత్రియ సేవా సమితి హాల్ నందు ఉచిత కేన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా బసవ తారకం హాస్పిటల్ వారి మొబైల్ వాహనం ఏర్పాటు చేసి ఆధునిక వైద్యులచే పరీక్షలు నిర్వహించారు. మహిళలు అనేక సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్లోబల్ ఫౌండేషన్ కన్వీనర్ నడింపల్లి రామరాజు మాట్లాడుతూ గ్రామంలో అందరూ నారోగ్యంతో బాధపడకుండా ఉండాలని గ్లోబల్ ఫౌండేషన్ వన్నె చింతలపూడి గ్రామస్తులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా రాజరత్న నాగవాణీ కృష్ణ, అమలాపురం లయన్స్ క్లబ్ సభ్యులు, జోన్ ఛైర్‌పర్సన్ జంపన సుమన్ వర్మ, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బాలలను కార్మికులుగా చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-ఆలమూరు

బాలలను కార్మికులుగా చేస్తే కఠిన చర్యలు తప్పవని మండపేట, రాయవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు కె.శివ నాగమల్లేశ్వరరావు, జి.కేశవరావులు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని బాలకార్మికులను గుర్తుంచుటకు ఎంఇఒ పి.షాలేంరాజు, శ్రమ ఆర్గనైజేషన్ ప్రతినిధి నాగేశ్వరి, జానకికళ్యాణి వెల్ఫేర్ సొసైటీ మెంబెర్ దుర్గారావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి, పోలీసు సిబ్బందితో కలసి వారు ఇటుక బట్టీలు, గేదెల ఫార్మ్, పురుగు మందుల షాపులు, బేకరీలు, క్లాత్ షాపులు, కిరాణా షాపులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ళు నిడకుండా పిల్లలను పనిలోనికి పెట్టుకోవద్దన్నారు. నిబంధనలను అతిక్రమించి పనిలో పిల్లలను పెట్టుకుంటే సెక్షన్ 3 బాలకార్మికుల నిర్మూలన చట్టం ప్రకారం కోర్టు ద్వారా చర్యలు చేపడతామన్నారు. అలాగే ఆ విధంగా ప్రవర్తించే యజమానులకు జైలు శిక్షతో పాటుగా జరిమానా కూడా విధిస్తారన్నారు. బట్టీల వద్ద పనిచేసే తల్లిదండ్రులకు హెచ్చరికలు చేస్తూ పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రమణారెడ్డి, సిఆర్‌పి శ్రీనివాస్, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు మల్లేశ్వర రావు, కేశవరావులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా కేంద్రం అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం అమలాపురం ఎస్‌కెబిఆర్ కళాశాలకు రాజ మహేంద్రవరం నుంచి విచ్చేసిన ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు (ఆర్‌జెడి) డాక్టర్ ఎస్.శోభారాణికి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు వినతి పత్రం అందించారు. అయిదు సంవత్సరాల క్రితం వరకు ఎయిడెడ్ కళాశాలగా ఉన్న ఎస్‌కెబిఆర్ కళాశాల గత ప్రభుత్వం ఎయిడెడ్ వ్యవస్థను రద్దు చేయడంతో ప్రయివేటు కళాశాలగా యాజమాన్యం నడుపుతోందన్నారు. ఎస్‌కెబిఆర్ కళాశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా మార్చాలని ఆర్‌జెడిని కోరారు. దీనిపై ఆర్‌జెడి శోభారాణి స్పంది స్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు మరియు అమలాపురం ప్రాంత ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలో అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామన్ మ్యాన్ ఫౌండేషన్ అధ్యక్షులు కాశి చంద్రమౌళి పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను ప్రముఖులు వివరిం చారు. **అమలాపురం:** సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడానికి యోగా ఉపకరిస్తుంద జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఓం శాంతి నిలయం నందు బ్రహ్మకుమారిస్ వారి సౌజన్యంతో జిల్లాస్థాయి అంత ర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని అధికారులు, బాల బాలికలతో యోగాసనాలు నిర్వహిం చారు. ఈ యోగాసనాలలో జిల్లా కలెక్టర్ పాల్గొని యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవ సాయ శాఖ సంయుక్త సంచాలకులు ఎ.బోసు బాబు, జిల్లా పంచాయి తీరాజ్ సూపరింటెం డెంట్ ఇంజినీర్ కె. చంటిబాబు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ అధికారి సురేష్ కుమార్, వికాస జిల్లా మేనే జర్ గోళ్ళ రమేష్, వివిధ శాఖలకు చెందిన సిబ్బంది బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిమోడరన్ విద్యాసంస్థలలో శు క్రవారం ఘనంగా నిర్వహించారు. మోడరన్ డిగ్రీ కాలేజీ , ఎబిసి మోడరన్ ప్రైమరీ స్కూల్ లోను స్ఫూర్తిదాయకంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తొగరు మూర్తి హాజరయ్యారు. ఆయన మాట్లా డుతూ యోగా అనేది ప్రాచీన కాలం నుండి భారతదేశానికి సంబంధించిన అద్భుతమైన ప్రక్రియ అని అన్నారు.. మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జివి. రావు మాట్లాడుతూ విద్యార్థులకే కాకుండా అందరికీ ఏకాగ్రత కలుగజేసే మహత్తర శక్తి యోగాకు ఉందని పేర్కొన్నారు.ఉత్తమ జీవన విధానాన్ని కలుగజేసే యోగాను అందరూపాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి, ఎన్ఎస్ఎస్ కో -ఆర్డినేటర్ జి. మాణిక్యం, మోడరన్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ లో యోగా దినోత్సవం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పెల్లి మురళీమోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారదా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్ తది తరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగా దినోత్సవాన్ని రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధి లో శుక్రవారం నిర్వహిం చారు. యోగా దినోత్సవ విశిష్టతను డిఎస్‌పి రామకృష్ణ వివరిం చారు. మండపేట రూరల్ సీఐ శ్రీధర్, రామచంద్రపురం సిఐ పి. దొర రాజు సబ్ డివిజన్ ఎస్ఐలు , సిబ్బందితో కలిసి యోగా సనాలు వేశారు. **మామిడికుదురు:** పాశర్లపూడి కైకాల పేట ప్రాథమిక పాఠశాల్లో ఆయుష్మాన్ ఆరోగ్యమిషన్ లో పనిచేస్తున్న ఇం దిర ఆధ్వర్యంలో యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె. సూర్యనారాయణ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల శాఖఆధ్వర్యంలో మామిడికుదురు హైస్కూల్ ప్రాంగణంలో యోగా కార్యక్రమం నిర్వహించారు తాటికాయల వెంకటేశ్వరరావు శిక్షణలో యోగాసనాలు వేశారు. అనంతరం యో గా గురు వును సత్కరించారు. కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షులు మెండా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** చింతలూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉడత వెంకటేశ్వరరావు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు. **కాట్రేనికోన:** చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాల స్థానిక వివేకానంద కేంద్ర కన్యాకుమారి కార్యస్థాన్ సంస్థ మరియు కళాశాల ఎన్.ఎస్ ఎస్ విభాగము సంయుక్తంగా యోగా దినోత్సవము ను నిర్వహించారు ఆ సంస్థ నిర్వాహకులైన గండికోట శ్రీనివాస్, యోగ నిపుణులు కార్తీక్ లు విచ్చేసారు కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎన్ఎస్. వర్మ కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బి.రత్నరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో యోగా చేస్తున్న లయన్ జివి.రావు, విద్యార్థులు

కూటమి ఆధ్వర్యంలో సంబరాలు

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

కూటమి ఎంఎల్ఎలు అసెంబ్లీలో శుక్రవారం ప్రమాణస్వీకరాం చేశారు ఈ సందర్భంగా అల్లవరం మండలంలో మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు ఆధ్వర్యంలో ఎన్‌డియే కోడూరుపాడులోని టిడిపి కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వేగిరాజు వెంకటరాజు, దాట్ల గోపిరాజు, గోసంగి స్టాలిన్ బాబు, కంకిపాటి వీరబాబు, కంకిపాటి సుబ్బారావు, ఆకుల లక్ష్మణరావు, తోట నరసింహారావు, కడలి వెంకటేశ్వరరావు, బండి గుప్తాపు సత్తిబాబుకార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



టిడిపి కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎన్‌డియే నాయకులు, కార్యకర్తలు

నేరాలు ఘోరాలు

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

తూర్పుగోదావరి జిల్లా సెబ్ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని దొండపూడి గ్రామంలో శుక్రవారం దాడులు నిర్వహించినట్లు సెబ్ సిఐ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో 20 లీటర్ల నాటు సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఆయన వెంట ఎస్ఐ పి .సుధీర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఘటన స్థలంలో సుబ్బారావు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

216(ఏ)నెంబరు జాతీయ రహదారిపై చెముడులంక ధనలక్ష్మి ఆలయం ఎదురుగా గురువారం అర్ధరాత్రి బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒక రైతు మతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని చెముడులంకకు చెందిన గల్లా సుబ్బారావు (56) రైతువారి పనులు చేసుకుంటూ ఉంటారు. ఎప్పటిలాగే తన పొలంలో పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో బైక్ పై రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో రాజమహేంద్రవరం వైపు నుండి రావులపాలెం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైకును ఢీకొంది. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే సుబ్బారావు మృతి చెందరన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న హైవే పోలీస్ సిబ్బంది,నేషనల్ హైవే రోడ్ సేఫ్టీ సిబ్బంది కలిసి ట్రాఫిక్ ను నియంత్రించారు.



డీజిల్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

డీజిల్ స్వాధీనం : డ్రైవర్ అరెస్టు

ప్రజాశక్తి-కాజులూరు

అక్రమంగా తరలిస్తున్న డీజిల్‌ను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు రాజమండ్రి విజిలెన్స్ ఎస్ఐ టి.జగన్ మోహన్ రెడ్డి, ఎంఎస్ఒ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. కోలంక వద్ద సాధారణ తనిఖీల్లో భాగంగా యానాం నుంచి పెదపూడి వెళుతున్న వ్యాన్‌ను తనిఖీ చేయగా 16 పీపాల్లో ఉన్న 3200 లీటర్ల డీజిల్‌ను గుర్తించామని తెలిపారు. గొల్లపాలెం స్టేషన్‌లో వ్యాన్, డ్రైవర్‌ను అప్పగించి ఐఒసి పెట్రోల్ బంక్‌లో డీజిల్ అప్పగించినట్లు ఆయన తెలిపారు. డీజిల్ విలువ రూ.2,72,000 ఉంటుందని వారు తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది కుమార్, కిషోర్, విఆర్ఒ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యానాం వార్తలు

కామిశెట్టి సావిత్రికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచ్ కాలంలో మేయర్‌గా పని చేసిన కామిశెట్టి సావిత్రి వర్ధంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాజశేఖరన్, పైడికొండల రాజబాబు, భగవాన్, కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఫ్రీజర్ బాక్స్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్లు కొంతకాలంగా పని చేయడం లేదని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పుదుచ్చేరి హోమ్ శాఖమంత్రి నమశ్శివాయం, ఆరోగ్యశాఖ అధికారి శ్రీరాములతో ఫోన్లో మాట్లాడినట్లు పేర్కొన్నారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని వారం, పది రోజుల లోపు నూతన ఫ్రీజర్ బాక్స్ లను ఏర్పాటు చేస్తామన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

ప్రజాశక్తి-యానాం



మిషన్ శక్తి ఆధ్వర్యాన యోగా డే

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాజశేఖరన్, ప్రభుత్వ ఆసుపత్రి డిడిటి రవి శంకర్, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐ, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మిషన్ శక్తి కో ఆర్డినేటర్ రిపిక రోజెలిన్ ఆధ్వర్యంలో యోగా విశిష్టతను వివరించారు. వారితో యోగ ఆసనాలు వేయించారు. ప్రభుత్వాసుపత్రిలో డిడి రవిశంకర్ ప్రసాద్, మిషన్ శక్తి బృందం సభ్యులు మహాలక్ష్మి, సత్య సుధ, తేజస్విని, పుణ్య లక్ష్మి, విజయ కుమారి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానం

ప్రజాశక్తి - యానాం

స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్, సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో ఖాళీ సీట్లను ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ వేలాయుధం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చేవారు ఈ నెల 26నఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు హాజరవ్వాలని కోరారు. ఈ అవకాశాన్ని పుదుచ్చేరి, ఇతర రాష్ట్ర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వేణును అందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యాపక బృందం

అమరావతి విట్‌లో వేణుకు ప్రవేశం

ప్రజాశక్తి-కాజులూరు

అమరావతి విట్ కళాశాలలో కాజులూరు విద్యార్థిని కేతా వేణుకు ఉచిత ప్రవేశం లభించిందని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కాజులూరు ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన వేణును సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన అమరావతి విట్ కళాశాలలో బి.టెక్ చదివేందుకు కేత వేణు ఉచిత ప్రవేశం లభించిందని నాలుగు ఏళ్లపాటు ఎటువంటి ఫీజులు చెల్లించకుండా చదివేందుకు అవకాశం కలిగిందన్నారు. ఇంటర్మీడియట్లో 1000 మార్కులకు 974 మార్కులు సాధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రభుత్వ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించినట్టు తెలిపారు.

వైసిపి శిలాఫలకాలు ధ్వంసం

అనుమానంతో ఇద్దరు టిడిపి వ్యక్తులపై దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వెంకటాయపాలెంలో గుర్తు తెలియని వ్యక్తులు నూతన సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైసిపి పార్టీకి చెందిన శిలాఫలకాలను, జెండా దిమ్మను గురువారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. దీనిపై ఆ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా శిలాఫలకం, జెండా దిమ్మను పగుల గొట్టారనే అనుమానంతో టిడిపికి చెందిన అయినాల మణికంఠ, అయినాల వేణులపై కొందరు దాడి చేశారు. గాయపడిన వారిని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు, టిడిపి నాయకులు తెలిపారు.

ఫిషింగ్ హార్బర్ పరిశీలన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి



గట్టును పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం నూతనంగా నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేట ముగించుకుని వస్తున్న మత్స్యకారులకు అనువైన స్థలం లేకపోవడంతో గట్టుకు ఢీకొని బోట్లు ధ్వంసం అవడమే కాక మత్స్యకారులు ప్రాణాలు సైతం కోల్పోతున్నారని తెలిపారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళి ఇక్కడ సమస్యను తెలుపుతామన్నారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు అనిశెట్టి సత్యానంద రెడ్డి, చోడిపల్లి ప్రసాద్, కొర్ని రమణ, సూరాడ రాజు ఉన్నారు.

పవన్ కళ్యాణ్ నిర్ణయంపై కుడుపూడి హర్షం

ప్రజాశక్తి-తాళ్లరేవు

ఉపాధి హామీ పథకానికి వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేస్తూ డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఎఎంసి మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ హర్షం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అత్తిలి బాబూరావు, విళ్ళ వీరతో కలిసి ఆయన పి.మల్లవరంలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ రంగం బలోపేతానికి ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత ఉపకరిస్తుం దన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-మామిడికుదురు

పాము కాటుకు మహిళ మృతి చెందింది. వివరాలు ఇవి.. పాశర్లపూడి బాడవ కు చెందిన వనమాడి అంజలీదేవి (38) ఈనెల 20న ఉదయంసమయంలో ఇంటివద్ద వాకిలి తుడుస్తోంది. ఈ సమయంలో విషసర్పం ఆమెను కాటువేసింది. దీంతో అమలాపురం శ్రీనిధి ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్టు ఆమె భర్త శ్రీమన్నారాయణ నగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు నగరం ఎస్ఐ సురేశ్ తెలిపారు.

పాతకోట గ్రామంలో తాగునీటి సమస్య

వారం రోజులుగా రంగు మారిన నీరే సరఫరా

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని పాతకోట గ్రామంలో మంచినీటి సమస్య ఉత్పన్నమైంది. ఇక్కడ గత వారం రోజులుగా మంచినీరు రంగు మారి సరఫరా అవుతోంది అని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు మంచినీటి చెరువులో నీళ్లు అయిపో యినప్పటికీ నేటికీ చెరువులో మంచి నీటిని నేటికీ నింపలేదని, దీంతో రంగు మారిన నీళ్లు సరఫరా అవుతున్నాయని గ్రామస్తుడు కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం 'ప్రజాశక్తి'కి తెలిపారు. వెంటనే చెరువును మంచినీటితో నింపి మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని రక్షిత మంచినీటిని స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామ కార్యదర్శి వివరణ

మంచినీటి రంగు మారడం చెరువులో నీరు లేకుండా పోవడంపై గ్రామ కార్యదర్శి శీతంశెట్టి సుబ్బారావు ను వివరణ కోరగా చెరువులో వేసవిలో మంచినీరు అయిపోయిందన్నారు. ప్రస్తుతం ఫిల్టర్ బెడ్ లో శుభ్రపరిచామని అన్నారు. మిగిలిన నీటిని పూర్తిగా ఇంజన్లతో తోడించి, మంచినీటిని నింపుతామని, నీరు తక్కువగా ఉండటం వల్ల ఫిల్టర్ అయినప్పటికీ రంగు మారి నట్లు కనిపిస్తున్నాయని అన్నారు. అయితే నీటి స్వచ్ఛత కోసం కలపాల్సిన లిక్విడ్స్ ను కలిపితే నీరు తెల్లగా మారుతుందని, ఫిల్టర్ బెడ్లను శుభ్రపరిచి సిద్ధంగా ఉంచామన్నారు. నాలుగు ఐదు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని కార్యదర్శి వివరించారు.



నీరు లేకుండా ఎండగట్టిన మంచినీటి చెరువు (ఇన్‌సెట్)లో రంగు మారిన తాగునీరు